సాక్షి
కుమురం భీం

బుధవారం । 26 । ఫిబ్రవరి । 2025


విద్యుత్ దీపాలతో ముస్తాబైన నంబాలలోని ప్రసన్న పరమేశ్వర ఆలయం

నమః శివాయ..!

- నేడు మహాశివరాత్రి
- విద్యుత్ దీపాలతో ఆలయాలు ముస్తాబు
- పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవానికి ఏర్పాట్లు
- తరలిరానున్న భక్తజనం

లయకారుడు.. ముక్కంటి.. కైలాసవాసి.. ఇలా ఏ పేరుతో పిలిచినా భక్తుల కోర్కెలు తీర్చేవాడు బోళా శంకరుడు మహాశివుడు. సృష్టికి మూలమైన పరమేశ్వరుడిని పూజిస్తే మోక్షం లభిస్తుందని భక్తులు నమ్ముతారు. శివపూజకు మహాశివరాత్రిని అత్యంత శుభప్రదంగా భావిస్తారు. ఈ రోజు ఆదిశంకరునికి అభిషేకం చేసి.. పూజించి.. ఉపవాసం చేసి.. జాగరణ చేస్తే శుభఫలితాలు కలుగుతాయని విశ్వాసం. ముక్కంటిగా భక్తకోటితో నిరంతరం పూజలందుకుంటున్న అభిషేక ప్రియుడి నామస్మరణతో బుధవారం మహాశివరాత్రి పండుగను జరుపుకోవడానికి భక్తులు సిద్ధమయ్యారు. మహా శివరాత్రి సందర్భంగా జిల్లాలోని ప్రముఖ శివాలయాలపై ప్రత్యేక కథనం.


కౌటాలలోని శివాలయం ఎదుట శివుడి విగ్రహం

కాకతీయుల విజయానికి చిహ్నం

వాంకిడి: మండల కేంద్రంలోని చిక్లీ వాగు వద్ద కాకతీయుల కాలంలో నిర్మించిన శివాలయం చరిత్రకు చిహ్నంగా, భక్తుల కొంగుబంగారంలా నిలుస్తోంది. మహాశివరాత్రి పర్వదినాన చిక్లీ వాగు తీరంలో నిర్వహించే జాతరకు ఆలయాన్ని విద్యుత్ వెలుగులతో ముస్తాబు చేశారు. ఇది ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వేయి స్తంభాల గుడిని పోలి ఉండటంతో శివరాత్రి రోజున భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. కాకతీయుల చరిత్రను కళ్లకు కట్టినట్లు చూపించే కట్టడాలు నేటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. మరాఠా రాజులతో జరిగిన యుద్ధంలో రాణి రుద్రమదేవి కొన్నిరోజుల పాటు వీరోచిత పోరాటం సాగించి వారిని మహారాష్ట్ర సరిహద్దులోని వాంకిడి వరకు తరిమికొట్టినట్లు చరిత్రకారులు చెబుతుంటారు. కాకతీయుల విజయానికి చిహ్నంగా వాంకిడి మండల కేంద్రంలోని చిక్లీ వాగు ఒడ్డున శివకేశవాలయాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. ఆలయం నిర్మాణంలో భారీ రాతి బండలు వినియోగించారు. ఓరుగల్లు నుంచి ఏనుగుల సాయంతో వాటిని ఇక్కడికి తెప్పించి ఆలయ నిర్మాణానికి వాడినట్లు చరిత్రకారులు గుర్తించారు. అందువల్లే ఆలయం వేయి స్తంభాల గుడిని పోలి ఉంటుంది. స్తంభాలు, స్త్రీల నృత్య భంగిమలు, గుడి ముఖద్వారం వద్ద నంది విగ్రహం, విడివిడిగా ఏర్పాటు చేసిన అనేక విగ్రహాలు ఆకట్టుకుంటాయి. శివ, కేశవులు ఒకేచోట ఉండటం ఈ ఆలయం ప్రత్యేకత. మరోవైపు రేణుక మాత విగ్రహాలు అదనపు ఆకర్షణగా నిలుస్తాయి. మహాశివరాత్రికి కెరమెరి, కాగజ్‌నగర్, రెబ్బెనతో పాటు మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా నుంచి భారీగా తరలివస్తారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు, చిక్లీ వాగు తీరంలో రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. రాత్రంగా భజనలతో జాగరన చేయనున్నారు.


విద్యుత్ వెలుగులతో శివకేశవాలయం

భక్తులను కాచే.. ప్రసన్న పరమేశ్వరుడు

రెబ్బెన: మండలంలోని నంబాలలో ప్రసిద్ధి గాంచిన ప్రసన్న పరమేశ్వర ఆలయంలో మూడు రోజులపాటు జాతర మహోత్సవం నిర్వహించనున్నారు. శివపార్వతుల కల్యాణంతోపాటు రథోత్సవం కనుల పండువగా జరగనున్నాయి. స్థల పురాణం ప్రకారం.. 67 ఏళ్ల క్రితం తాండూర్ మండలం కొత్తపల్లికు చెందిన మైదం లస్మయ్య వంగిపోయిన నడుంతో బాధపడుతుండేవాడు. ఒక రోజు నంబాలకు ఎంతో కష్టపడుతూ వస్తుండగా మార్గమధ్యలో ఒక నాగసర్పం కనిపించింది. అది చూసి భయకంపితుడు కాగా వెంటనే ఆ సర్పం మాయమై ఒక బండరాయిపై సాధువు ప్రత్యక్షమై భయపడొద్దు అంటూ లస్మయ్యకు ధైర్యం చెప్పాడు. సాధువు కళ్లు మూసుకోమని చెప్పడంతో లస్మయ్య కళ్లు మూసుకున్నాడు. అతడి నడుము చుట్టూ నాగ సర్పం చుట్టుకుంది. నీ నడుం బాగైంది చూసుకోమని సాధువుతో పాటు నాగసర్పం.. రెండూ అదృశ్యమయ్యాయి. భక్తుల కోరికలు తీర్చేందుకు ఇక్కడ అవతరిస్తున్నాని, భక్తిశ్రద్ధలతో పూజించేవారి కోరికలు నెరవేరుస్తానని అతడికి చెప్పారు. వెంటనే లస్మయ్య ఆరోగ్యంతో నంబాలకు వచ్చి విషయాన్ని గ్రామస్తులకు తెలియజేశాడు. ఆనాటి నుంచి ప్రసన్న పరమేశ్వరుడు భక్తులను కంటికి రెప్పలా కాపాడుతాడని స్థానికులు నమ్ముతారు. ఆలయంలో గణపతి, శివలింగం, పార్వతీదేవి, నందాఈశ్వరుడు, నాగేంద్రుడు, సూర్య భగవానుడు, ఆంజనేయస్వామి, నవ గ్రహాలు విగ్రహాలు ఉన్నాయి.

51 ఏళ్లుగా ఉత్సవాలు



కౌటాల: కౌటాలలోని సదాశివపేట పురాతన శివాలయంలో 51 ఏళ్లుగా శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆలయ ఆవరణలో కార్తిక్ మహరాజ్, నాగదేవత, హనుమాన్ ఆలయాలు ఉన్నాయి. బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని అర్చకులు అంబేద శంకరయ్య, సంతోష్ తెలిపారు. సాయంత్రం పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవం ఉంటుందని వెల్లడించారు.

విద్యుత్ కాంతుల్లో శివాలయం


కెరమెరిలోని శివాలయం

కెరమెరి: మండల కేంద్రంలోని శివాలయంతోపాటు నెహ్రూనగర్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని విద్యుత్ లైట్లతో అలంకరించారు. బుధవారం ఉదయం 11 గంటలకు వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి పల్లకి ఊరేగింపు నిర్వహించనున్నారు. ఆదివాసీ సంప్రదాయ పద్ధతుల్లో ఢోలు, సన్నాయి, కాలికోమ్‌లు సిద్ధం చేశారు. శివాలయంలో ఉదయం నుంచి పూజలు కొనసాగనున్నాయి.

భద్రకాళి సమేత వీరభద్రుడు



పెంచికల్‌పేట్: జయ మంగళ నది(పెద్ద వాగు) ఒడ్డున పంచకళాపురి క్షేత్రంలో నాలుగు వందల ఏళ్ల క్రితం భద్రకాళిసమేత వీరభద్రస్వామి ఆలయం వెలసింది. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, గురువారం అమ్మవారికి అభిషేకం, కల్యాణోత్సవం, అగ్నిగుండ ప్రతిష్ట నిర్వహించనున్నారు. శుక్రవారం ప్రభల ఊరేగింపు, అగ్నిగుండ ప్రవేశంతో జాతర ముగియనుంది. పీఠాధిపతి మూలమఠం శివప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

రంగనాయక ఆలయం ముస్తాబు


శ్రీరంగనాయక ఆలయం

బెజ్జూర్: మహా శివరాత్రిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీరంగనాయక ఆలయంతోపాటు శివాలయం, బ్రహ్మంగారి ఆలయం, హనుమాన్ ఆలయాలు ముస్తాబు చేశారు. ఉత్సవాల కోసం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. భక్తులకు టెంట్లు వేసి నీడ సౌకర్యం కల్పిస్తున్నారు.

న్యూస్‌రీల్

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం


అవగాహన కల్పిస్తున్న రాజేశ్వర్ జోషి

ఆసిఫాబాద్‌అర్బన్: ఆర్థిక అక్షరాస్యతపై మహిళలకు అవగాహన అవసరమని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రాజేశ్వర్ జోషి అన్నారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో మంగళవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ రూపాయి ఉపయోగపడే విధంగా ఖర్చు చేయాలని, అప్పుడే కుటుంబాలు ఆర్థికంగా బలపడతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. బ్యాంకు మేనేజర్ జీవన్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ఎస్‌బీఐ ఆధ్వర్యంలో అందిస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో డీపీఎం అన్నాజీ, ఏపీఎం సదానందం, బ్యాంకు సిబ్బంది సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లు పరిశీలన

వాంకిడి: మహాశివరాత్రిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని చిక్లీ వాగు తీరంలో నిర్వహించే జాతర ఏర్పాట్లను ఏఎస్పీ చిత్తరంజన్ మంగళవారం పరిశీలించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట సీఐ సత్యనారాయణ, ఎస్సై ప్రశాంత్ ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు జాతీయస్థాయి నెట్‌బాల్ జూనియర్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ దుర్గం మహేశ్వర్, పీడీ బి.తిరుపతి తెలిపారు. ఎంపికైన వారిని మంగళవారం అభినందించారు. ఆర్.పల్లవి, కె.రోషిణి, ఎం.దీపిక, ఎం.రోహన్, ఎస్.రోహిత్ ఈ నెల 26, 27, 28 తేదీల్లో హర్యానాలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఇదే పోటీలకు ఎంపికైన జిల్లాకు చెందిన డి.వినత్రయను నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అలీబిన్ అహ్మద్ అభినందించారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్‌అర్బన్: పదో తరగతి వార్షిక ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీల ప్రిన్సిపాళ్లతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు నిర్వహించిన ఐదు వారాంతపు పరీక్షల్లో మెరుగైన ఫలితాలు కనిపించాయని అన్నారు. రానున్న 24 రోజుల్లో షెడ్యూల్ ప్రకారం బోధించాలని సూచించారు. పీఎం శ్రీ పథకంలో భాగంగా కేటాయించిన నిధులు డ్రా చేయాలన్నారు. సమావేశంలో ఏసీజీఈ ఉదయ్‌బాబు, జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం కార్యదర్శి వెంకటేశ్వరస్వామి, ఎఫ్ఏవో దేవాజీ, కోఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా

ఆసిఫాబాద్‌అర్బన్: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని ఎస్ఈ శేషారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగజ్‌నగర్ డివిజనల్‌లో 132/22 కేవీ కౌటాల సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తయిందని, వారంలో అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. టీజీ ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో రూ.31.19 కోట్లు వెచ్చించి సబ్‌స్టేషన్ నిర్మించామని, 165 టవర్లు, 43.2 కిలోమీటర్ల మేర లైన్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. చింతలమానెపల్లి, బెజ్జూర్, కౌటాల, సిర్పూర్(టి) మండలాలకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. కౌటాల సబ్‌స్టేషన్ నుంచి 104 గ్రామాల ప్రజలకు అంతరాయం లేని విద్యుత్ అందిస్తామని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం సూక్ష్మ పరిశీలకులు, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, సెక్టార్ మోడల్ అధికారులకు అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ 27న ఉదయం 8 గంటల నుంచి 4 గంటల వరకు ఓటింగ్ కొనసాగుతుందన్నారు. ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను సీల్ చేసి రిసెప్షన్ కేంద్రాలకు అప్పగించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్‌లో బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని కలెక్టర్ పరిశీలించారు. బుధవారం సంబంధిత అధికారులు సామగ్రి తీసుకోవాలని సూచించారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. పోలింగ్ ఏజెంట్లు కేంద్రాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. డ్రా పద్ధతిలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో బ్యాలెట్ బాక్సులు కేటాయిస్తామని తెలిపారు. ఆయా సమావేశాల్లో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఓటర్లకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

వాంకిడి: ఓటర్లకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. వాంకిడి మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఓటర్ల సౌకర్యార్థం తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, మూత్రశాలలు, లైటింగ్, ఫ్యాన్లు తదితర వసతులు కల్పించాలని తహసీల్దార్ రియాజ్ అలీని ఆదేశించారు. సీఐ సత్యనారాయణ, ఎస్సై ప్రశాంత్, హెచ్ఎం నటరాజ్ ఉన్నారు.

ఎన్నికల జాగారం

- శివరాత్రి తెల్లారే ఎమ్మెల్సీ పోలింగ్
- పట్టభద్రులు, టీచర్ అభ్యర్థుల ఆరాటం
- ప్రచారం ముగిసి తెరవెనుక మంత్రాంగం

ఎమ్మెల్సీ ఓటర్ల వివరాలు	పట్టభద్రులు	టీచర్లు
	3,55,159	27,088

పట్టభద్రుల అభ్యర్థులు


వూట్కూరి నరేందర్ రెడ్డి


అంజిరెడ్డి


ప్రసన్న హరికృష్ణ



బక్క జడ్సన్

టీచర్ల అభ్యర్థులు


మల్క కొమురయ్య


వంగ మహేందర్‌రెడ్డి


తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డి


కూర రఘోత్తంరెడ్డి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మెదక్-కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఘట్టం తుది అంకానికి చేరుకుంది. పోలింగ్‌కు 48గంటల ముందే ప్రచారం నిలిపి వేయాల్సి ఉండడంతో తెరవెనుకఅభ్యర్థుల మంత్రాంగం మొదలైంది. నాలుగు పాత జిల్లాల్లోని మొత్తం 42అసెంబ్లీ స్థానాల పరిధిలో జరుగుతున్న పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలపై ఈసారి సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. పోటీలో ఉన్న వారందరూ గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ఓటర్ల మొగ్గుపై ఆసక్తి కొనసాగుతోంది. తమ అభ్యర్థుల విజయం కోసం ఆయా పార్టీల రాష్ట్ర అగ్ర నాయకత్వం ప్రచారంతో హోరెత్తించింది. గత ఎన్నికల కంటే ఈసారి మరింత దూకుడుగా అభ్యర్థులు తలపడుతున్నారు. ప్రచారంలో ఒకరిని మించి మరొకరు హామీలు ఇస్తూ ఓటర్లకు చేరువయ్యే ప్రయత్నం చేశారు. నేడు శివరాత్రి పండుగ ముగిసి, గురువారం ఉదయం 8నుంచే బ్యాలెట్ పేపర్‌పై ప్రాధాన్యత క్రమాన్ని ఓటర్లు వేయడం మొదలవుతుంది. దీంతో అభ్యర్థులు ఎన్నికల జాగారం చేయాల్సి వస్తోంది.

టీచర్ల స్థానానికి హోరాహోరీ

ఉపాధ్యాయ స్థానానికి మొత్తం 15మంది బరిలో ఉండగా, ఇందులో బీజేపీ నుంచి మల్క కొమురయ్య, పీఆర్టీయూ టీఎస్ నుంచి వంగ మహేందర్ రెడ్డి, తాజా మాజీ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, ఉమ్మడి జిల్లా నుంచి ఉపాధ్యాయ సంఘాల్లో చురుగ్గా ఉన్న పీఆర్టీయూ ఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు, టీఎస్‌సీపీఎస్ఈ యూనియన్ బలపర్చిన తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డితో సహా స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు. సీపీఎస్(కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం) రద్దు, 317జీవో, డీఏలు మెడికల్ రీయింబర్స్‌మెంట్స్ పెండింగ్, పే స్కేల్, పదోన్నతుల సమస్యలే ప్రచారంలో చర్చకు వచ్చాయి. అందరూ హామీలే ఇచ్చినప్పటికీ టీచర్లు ఎవరికి పట్టం కడుతారనే ఆసక్తి నెలకొంది. గతంలో మద్దతు తెలిపిన సంఘ సభ్యులందరూ ఒకే అభ్యర్థికి ఓట్లు వేసిన దాఖలాలు లేవు. చాప కింద నీరులా కొందరు అభ్యర్థులు తెరవెనుక మంత్రాంగం నడిపించి ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు వ్యూహాత్మకంగా వెళ్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆయా ఓటర్లకు తాయిలాలు అందే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇంకా విందులు నడుస్తున్నాయి.

పట్టభద్రుల ప్రసన్నం కోసం

కాంగ్రెస్ పార్టీ నుంచి నరేందర్‌రెడ్డి, బీజేపీ మద్దతుతో అంజిరెడ్డి, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణతో సహా మొత్తం 56మంది బరిలో ఉన్నారు. తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి సహా రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు స్థానిక నాయకులు చెమటోడుస్తున్నారు. బీజేపీ నుంచి కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో సహా ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులు ప్రచారం చేశారు. బీఎస్పీ నుంచి పోటీలో ఉన్న ప్రసన్న హరికృష్ణ బీసీ నినాదంతో ముందుకు వస్తున్నారు. వీరితోపాటు బక్క జడ్సన్ పలువురు స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇప్పటికే బహిరంగ సభలు, సమావేశాలు, ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. అంతేకాక ఎవరికివారు సామాజిక మాధ్యమాలు, ఫోన్లు, మేసేజ్‌లు, వాట్సాప్‌ల్లో జోరుగా ప్రచారం నిర్వహించారు. ప్రధానంగా ముగ్గురి మధ్యే పోటీ నెలకొనడంతో పట్టభద్రులు తమ ప్రాధాన్యతను ఎలా వ్యక్తపరుస్తారనేది ఆసక్తిగా మారింది. పట్టభద్రుల ప్రసన్నం కోసం చివరి అస్త్రంగా నగదు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లుగా సమాచారం.

ప్రశాంత వాతావరణంలో రంజాన్ జరుపుకోవాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రశాంత వాతావరణంలో రంజాన్ పండుగ జరుపుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, విద్యుత్, మిషన్ భగీరథ అధికారులు, ముస్లిం మతపెద్దలు, మసీద్ కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మసీదుల వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. ప్రార్థన సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఇన్‌చార్జి మైనార్టీ సంక్షేమశాఖ అధికారి రమాదేవి, డీఆర్‌డీవో దత్తారావు, విద్యుత్‌శాఖ ఎస్ఈ శేషారావు, డీఎంహెచ్‌వో సీతారాం, మున్సిపల్ కమిషనర్లు భుజంగరావు, అంజయ్య, తహసీల్దార్ రోహిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పాలిట శాపం’

సిర్పూర్(టి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా మారిందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వెంకట్రావ్‌పేట్ సమీపంలో ఉన్న జిన్నింగ్ మిల్లును మంగళవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ సీసీఐ కొనుగోళ్లపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జిన్నింగ్ మిల్లు యాజమాన్యం, సీసీఐ అధికారులు రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం చొరవ తీసుకుని మార్చి 15 వరకు సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు నిర్వహించాలని కోరారు. లేనిపక్షంలో రైతులతో కలిసి జాతీయ రహదారి దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లెండుగురె శ్యాంరావ్, షేక్ చాంద్, రాజు, రాజేశ్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.


జిన్నింగ్ మిల్లు పరిశీలిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

‘బీజేపీ అభ్యర్థుల విజయం ఖాయం’

ఆసిఫాబాద్‌అర్బన్: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయం ఖాయమని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలో అరిగెల నాగేశ్వర్‌రావు నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యావంతులు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని కోరారు. అంజిరెడ్డి, కొమురయ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. యువత బీజేపీకి మొగ్గు చూపుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, నాయకులు మల్లికార్జున్, విజయ్, పెంటయ్య, గణేశ్, ప్రసాద్ గౌడ్, శ్రీకాంత్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ నగేశ్, తదితరులు

క్లుప్తంగా

ఆగస్త్యకూడం అధిరోహించిన చెన్నూర్ యువకుడు


ఆగస్త్యకూడం(శిఖరం) ఎక్కిన సూరజ్

చెన్నూర్: పట్టణానికి చెందిన యువకుడు మంచాల సూరజ్.. ఆగస్త్యకూడం (శిఖరం) అధిరోహించాడు. మంచాల రాజబాపు-పద్మజ దంపతుల కుమారుడు సూరజ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈయన కేరళలోని తిరువనంతపురానికి 60 కి.మీ దూరంలో ఆగస్త్యకూడం (శిఖరం) 50 మీటర్ల ఎత్తును మూడు రోజుల్లో ట్రెక్కింగ్‌ను విజయవంతంగా పూర్తి చేశాడు. ఈ ట్రెక్కింగ్ జనవరి నుంచి ఏప్రిల్ వరకు కొనసాగుతుంది. శిఖరానికి ఆగస్త్య మహాముని పేరు పెట్టడంతో ఇది ప్రసిద్ధి చెందిన తీర్థయాత్రగా పేరొంది. యాత్ర చేపట్టేవారికి కేరళ ప్రభుత్వం ఆహార సదుపాయాలు కల్పిస్తోంది. ట్రెక్కింగ్ విజయవంతంగా పూర్తి చేసిన సూరజ్‌ను పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భైంసాటౌన్: పట్టణంలోని భైంసా-నిర్మల్ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. తానూరు మండలం ఎల్వికి చెందిన సాయినాథ్, లక్ష్మణ్ బైక్‌పై నిర్మల్ వైపు నుంచి భైంసా వైపు వస్తున్నారు. స్థానిక సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాల(పాత సరస్వతి కాలేజీ) వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని కిందపడి ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు 108లో ఏరియాస్పత్రికి తరలించారు.

హాజీపూర్‌లో ఇరువురికి..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలో మంగళవారం రాత్రి జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. హాజీపూర్‌లో మంచిర్యాల వైపు వస్తున్న ఓ ట్రాలీ రోడ్డు దాటుతున్న వృద్ధుడిని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడు చొప్పదండి మండలం కుర్మపల్లికి చెందిన గొర్రెల కాపరి పెద్ది కొమురయ్యను ఎస్సై సురేశ్ పోలీస్ వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హాజీపూర్ శివారులోని ఓ పైప్‌లైన్ కంపెనీ వద్ద ఆగి ఉన్న సాయి తన బైక్‌లో పెట్రోల్ లేకపోవడంతో రోడ్డుపై నిలిచి ఉన్నాడు. మంచిర్యాల వైపు వెళ్తున్న కర్ణమామిడికి చెందిన కోటి అజయ్ బైక్‌తో వేగంగా ఢీ కొట్టాడు. తీవ్రగాయాలైన అజయ్‌ను ప్రైవేట్ ఆస్పత్రికి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు.

పెద్దల సభలో..మనోళ్లు

- ఉమ్మడి జిల్లా నుంచి శాసన మండలికి పలువురి ప్రాతినిధ్యం
- ఛైర్మన్‌గా ఆదిలాబాద్‌కు చెందిన సయ్యద్ ముకషీర్ షా
- పి.నర్సారెడ్డి, జీవీ సుధాకర్‌రావు, పలువురు ఎమ్మెల్సీగా
- స్థానికసంస్థలు, ఎమ్మెల్యే కోటాలోనే అవకాశాలు



సయ్యద్ ముకషీర్ షా | పి.నర్సారెడ్డి | జీవీ సుధాకర్‌రావు | సుల్తాన్ అహ్మద్ | ప్రేమ్‌సాగర్ రావు | పొగాకు యాదగిరి | పురాణం సతీశ్ | దండే విఠల్

సాక్షి,ఆదిలాబాద్: మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గ పట్టభద్రుల, టీచర్స్ శాసనమండలి సభ్యుల ఎన్నికల వేడి ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల్లో ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఇటు పట్టభద్రుల పరంగా, అటు టీచర్స్ పరంగా ఒకరంటే ఒక్కరికి కూడా అవకాశం దక్కలేదు. పలువురు పోటీ చేసినప్పటికీ నిరాధారణకు గురయ్యారు. అయితే శాసనమండలి పరంగా ఉమ్మడి జిల్లాలో ఘన చరిత్ర ఉంది. ఆదిలాబాద్‌కు చెందిన సయ్యద్ ముకషీర్‌షా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనమండలికి 6వ చైర్మన్‌గా వ్యవహరించారు. రెండుసార్లు ఆయన చైర్మన్‌గా ఉండటం గమనార్హం. ఆ సమయంలో మర్రి చెన్నారెడ్డి, టి.అంజయ్య, భవనం వెంకట్రామిరెడ్డి, కోట్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎన్టీ రామారావు, నాదెండ్ల భాస్కర్‌రావు సీఎంలుగా ఉన్నారు.

మనోళ్లు ముఖ్య పదవుల్లో..

ఉమ్మడి జిల్లా నుంచి శాసనమండలి చైర్మన్‌గా ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సయ్యద్ ముకషీర్ షా వ్యవహరించిన ఘనత ఉంది. కాంగ్రెస్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ఒక్కసారి ఎన్నిక చేయగా, మరోసారి శాసన పరిషత్‌కు నామినేట్ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ శాసనమండలి 1958లో ఏర్పాటు కాగా, సీఎంగా వ్యవహరించిన ఎన్టీ రామారావు ఈ శాసనమండలి వ్యవస్థను 1985లో రద్దు చేశారు. అప్పుడు మండలి చివరి చైర్మన్‌గా ముకషీర్ షా ఉన్నారు. ఆ తర్వాత 2007లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్రంలో మళ్లీ శాసనమండలి పునరుద్ధరించారు. నిర్మల్‌కు చెందిన పి.నర్సారెడ్డి మూడుసార్లు ఎమ్మెల్యేగా, కేబినెట్ మంత్రిగా వ్యవహరించారు. శాసన మండలి సభ్యుడిగా ఉన్నారు. ఆ తర్వాత ఎంపీ అయ్యారు. అప్పట్లో ఏపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నారు. దండేపల్లికి చెందిన జీవీ సుధాకర్‌రావు ఒకసారి ఎమ్మెల్సీగా వ్యవహరించారు. అప్పటి సీఎం మర్రి చెన్నారెడ్డి మంత్రివర్గంలో భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేశారు.

ఎమ్మెల్యే కోటాలో..

ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన వారిలో ఇప్పటివరకు ఇద్దరు మాత్రమే ఉన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చెన్నూర్‌కు చెందిన సుల్తాన్ అహ్మద్‌ను మైనార్టీ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపిక చేశారు. అంతకుముందు 1999లో ఈయన సిర్పూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2004లో మళ్లీ టికెట్ ఆశించారు. ఆ సమయంలో కోనేరు కోనప్పకు కాంగ్రెస్ అధిష్టానం టికెట్ ఇవ్వగా, సుల్తాన్ అహ్మద్‌కు నామినేట్ పదవి విషయంలో భరోసానిచ్చారు. ఈమేరకే అప్పట్లో ఎమ్మెల్సీగా ఎన్నుకున్నారు. మంచిర్యాలకు చెందిన పొగాకు యాదగిరి న్యాయవాదిగా వ్యవహరించేవారు. ఎన్టీ రామారావు హయాం నుంచి టీడీపీలో ఉన్నారు. చంద్రబాబు ఆయనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు. వీరిద్దరు మినహా ఎవరు కూడా ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించలేదు.

ఉమ్మడి జిల్లా నుంచి ఎమ్మెల్సీలు

1.సయ్యద్ ముకషీర్ షా(మృతిచెందారు). 1979–80, 1981–85 (మండలి చైర్మన్), (స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు
2.పి.నర్సారెడ్డి (మృతిచెందారు). మూడు సార్లు ఎమ్మెల్యే, కేబినెట్ మంత్రి, ఆ తర్వాత 1981–85 వరకు ఎమ్మెల్సీగా, ఒకసారి ఎంపీగా వ్యవహరించారు.
3.జీవీ సుధాకర్‌రావు (మృతిచెందారు). 1977 (పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు).
4.మహ్మద్ సుల్తాన్ అహ్మద్ (మృతిచెందారు), 2007–09 (ఎమ్మెల్యే కోటా నుంచి ప్రాతినిధ్యం వహించారు)
5. ప్రేమ్‌సాగర్‌రావు, 2007–13 (స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు.
6. పొగాకు యాదగిరి (మృతిచెందారు). 2007 (ఎమ్మెల్యే కోటా నుంచి ప్రాతినిధ్యం వహించారు)
7. పురాణం సతీశ్, 2015–22 వరకు (స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం)
8. దండే విఠల్.. 2022 నుంచి 2028 వరకు కొనసాగనున్నారు. 'స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం).

స్థానిక సంస్థల నుంచే..

ఉమ్మడి జిల్లా స్థానికసంస్థల నుంచే జిల్లా ముగ్గురు నేతలకు అవకాశం దక్కింది. అందులో కాంగ్రెస్ నుంచి సయ్యద్ ముకషీర్ షా, ప్రేమ్‌సాగర్‌రావులు ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీగా వ్యవహరించిన పురాణం సతీశ్ పదవీ కాలం పూర్తయ్యే వరకు పార్టీలోనే కొనసాగారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన హస్తం పార్టీలో చేరారు. ప్రస్తుతం అదే పార్టీలో కొనసాగుతున్నారు. 2022లో ఆదిలాబాద్ స్థానిక సంస్థల బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా గెలిచిన దండే విఠల్ ఇప్పటికీ పదవిలో కొనసాగుతుండగా ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్నారు.

జాతర ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే


ట్యాంకును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

జైపూర్: వేలాల జాతర ఏర్పాట్లను చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి మంగళవారం పరిశీలించారు. గుట్టపై భక్తులకు తాగునీటి వసతి, ఆలయం వద్ద సౌకర్యాలు, గోదావరినదిలో పుణ్యస్నానాలు, గుట్టపైకి కాలినడక మార్గంలో వెళ్లేవారికి తాగునీరు, విశ్రాంతి సౌకర్యాలు పరిశీలించి పలు సూచనలు చేశారు. రామగుండం సీపీ శ్రీనివాస్, మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ నేతృత్వంలో ముగ్గురు ఏసీపీలు, ఆరుగురు సీఐలు, 30 మంది ఎస్సైలు, 35 మంది ఏఎస్సైలతో పాటు 600 మంది పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మంచిర్యాల, చెన్నూర్, గోదావరిఖని ప్రాంతాల నుంచి వేలాలకు 100 ఆర్టీసీ బస్సులు కేటాయించారు.

యంత్రాల పనిగంటలు పెంచాలి


ఇన్‌ఫిట్ క్రషర్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న డైరెక్టర్ సూర్యనారాయణ

శ్రీరాంపూర్: ఓపెన్ కాస్ట్ గనిలో భారీ యంత్రాల పనిగంటలు మరింత పెంచాలని సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్) ఎల్వీ.సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని సందర్శించారు. ఓసీపీలోని ఇన్‌ఫిట్ క్రషర్, సర్ఫేస్ క్రషర్లను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఓపెన్‌కాస్ట్ గని నుంచి ప్రతీరోజు 4రేకుల బొగ్గు రవాణా చేయాలన్నారు. శ్రీరాంపూర్ ఏరియా మొత్తం 7 రేకుల బొగ్గు రవాణా కావాల్సి ఉందన్నారు. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం(సీహెచ్‌పీ) తిరుమల్‌రావు, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఓసీపీ అధికారి టీ.శ్రీనివాస్, డీజీఎంలు కేశవరావు, రవీందర్, క్వాలిటీ ఇంచార్జి కే.వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రాజెక్ట్ ఇంజినీర్ నాగరాజు పాల్గొన్నారు.

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ

తానూరు: మహిళ మెడలో పుస్తెల తాడు అపహరించిన ఘటన మండలంలో బోంద్రట్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. బోంద్రట్ గ్రామానికి చెందిన పంచశీల మంగళవారం వ్యవసాయ పనులకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి తిరిగివస్తుంది. ఈ క్రమంలో ఎదురుగా బైక్‌పై ముసుగు ధరించి వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలో పుస్తెతాడును ఎత్తుకెళ్లి పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తమ్ముడిని దింపి వస్తానని వెళ్లి..

- కానరాని లోకాలకు సోదరుడు
- రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో మృతి
- ఒకరికి తీవ్రగాయాలు


దుర్గం రాజేశ్ (ఫైల్)


రాజేశ్ మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

భీమిని: 'అమ్మా.. తమ్ముడిని దింపి త్వరగా పని చూసుకుని వస్తా'అని చెప్పిన బయటకు వెళ్లిన పది నిమిషాలకే కుమారుడు అనంతలోకాలకు వెళ్లిపోయాడు. చేతికందిన కొడుకును రోడ్డు ప్రమాదం బలి తీసుకుంది. కన్నెపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని పోలంపల్లి వద్ద మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం..భీమిని మండలంలోని వీగాం గ్రామానికి చెందిన దుర్గం దేవాజీ-శంకరమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. పెద్ద కుమారుడు దుర్గం రాజేశ్ (29) కొరియర్ సర్వీస్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. చిన్న కుమారుడు అభిలాష్ బెల్లంపల్లిలో ఇంటర్ చదువుతున్నాడు. కూతురికి వివాహమైంది. ప్రతీరోజు లాగా రాజేష్, సోదరుడు అభిలాష్‌ను బైక్‌పై వీగాం బస్టాండ్‌లో దింపేందుకు వెళ్లాడు. అప్పటికే బస్సు వెళ్లిపోయింది. దీంతో ఇద్దరు కలిసి టేకులపల్లి క్రాస్‌రోడ్డు వద్దకు బయల్దేరారు. బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామానికి చెందిన పెట్టెం శ్రవణ్‌కుమార్ తన తండ్రి అంజయ్యతో కలిసి బైక్‌పై కన్నెపల్లి వైపు వేగంగా వస్తున్నాడు. పోలంపల్లి వద్ద రాజేశ్ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజేశ్ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. అభిలాష్ చెయ్యి విరిగి తీవ్రగాయాలపాలయ్యాడు. శ్రవణ్‌కుమార్, అంజయ్యలకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కన్నెపల్లి ఎస్సై గంగారాం, సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయాలైన అభిలాష్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి పంపించారు. రాజేశ్ మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి తండ్రి దేవాజీ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సైన్యం సిద్ధం

- 250మంది పోలీసులతో బందోబస్తు
- జిల్లాలో 58 పోలింగ్ కేంద్రాలు


ఆర్‌బీహెచ్‌వీ పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న డీసీపీ ఎగ్గడి భాస్కర్

మంచిర్యాలక్రైం: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 27న జరిగే పోలింగ్‌లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు యంత్రాంగం బందోబస్తుకు సిద్ధమైంది. మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ పర్యవేక్షణలో 250మంది బందోబస్తు నిర్వహించనున్నారు. జిల్లాలోని 21 ప్రాంతాల్లో 58 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలను డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్, సీఐ ప్రమోద్‌రావు మంగళవారం సందర్శించి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందని, ఈ నెల 25న సాయంత్రం 4గంటల నుంచి 27న సాయంత్రం 4గంటల వరకు మద్యం దుకాణాలు బంద్ చేయాలని పేర్కొన్నారు. ముగ్గురు ఏసీపీలు, 12మంది సీఐలు, 21మంది ఎస్సైలు, 212మంది ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు బందోబస్తులో పాల్గొంటారు.

విధుల్లో అలసత్వం ప్రదర్శించొద్దు

నస్పూర్: ఎన్నికల విధుల్లో పోలీసు సిబ్బంది అలసత్వం ప్రదర్శించొద్దని మంచిర్యాల డీసీపీ భాస్కర్ సూచించారు. గురువారం పోలింగ్ నేపథ్యంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై మంగళవారం ఆయన పట్టణ పరిధిలోని ఏఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో పోలీస్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాశ్, మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య


క్రాంతి (ఫైల్)

బెల్లంపల్లి: మద్యానికి బానిసై జల్సాల కోసం అప్పు చేసిన యువకుడు తీర్చేమార్గం లేక రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బెల్లంపల్లి జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ కథనం ప్రకారం.. కాసిపేట మండల కేంద్రానికి చెందిన దుర్గం క్రాంతి (29) జులాయిగా తిరిగేవాడు. అడపాదడపా మంచిర్యాలకు చెందిన ఓ రియల్టర్ వద్ద డ్రైవర్‌గా పనిచేస్తూ తెలిసిన వారి వద్ద అప్పులు చేసి మద్యం తాగేవాడు. అవివాహితుడైన క్రాంతి నెలక్రితం తల్లి దుర్గం వెంకటమ్మను బతిమిలాడటంతో ఆమె రూ.10 వేలు వేరే వ్యక్తుల వద్ద అప్పు అడిగి ఇచ్చింది. ఆ డబ్బులను తాగుడుకు ఖర్చు చేశాడు. మరోపక్క అప్పు ఇచ్చిన వారు అడగడంతో తప్పించుకు తిరుగుతున్నాడు. అప్పు తీర్చేమార్గం లేక క్రాంతి సోమవారం అర్ధరాత్రి సుబ్బారావుపల్లి శివారు వైపు వెళ్లి గుర్తుతెలియని రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మంగళవారం మృతదేహానికి పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఏరియాస్పత్రికి తరలించారు. ఆ తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించారు. తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

అప్పుల బాధతో ఒకరు..


వివరాలు నమోదు చేసుకుంటున్న ఎస్సై శంకర్

దస్తురాబాద్: అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శంకర్ కథనం ప్రకారం.. మండలంలోని గోడిసీర్యాల గోండుగూడ గ్రామానికి చెందిన నామెల్లిపురుక జగన్ (45), రాధ దంపతులు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె సంతానం. వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నారు. ఆయనకున్న ఎకరం భూమిలో పంట సాగు చేస్తున్నాడు. కొన్నేళ్ల క్రితం జగన్ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో పలువురి వద్ద చేసిన అప్పులు చేసి మద్యం తాగేవాడు. అప్పలు తీర్చే మార్గం లేకపోవడంతో మంగళవారం ఇంట్లో గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. ఆ సమయంలో భార్య రాధ పక్కింట్లోకి వెళ్లి తిరిగివచ్చింది. అప్పటికే పురుగుల మందు తాగిన జగన్ భార్యతో మాట్లాడుతున్నాడు. ఆ సమయంలో నోట్లో నుంచి నురుగులు కక్కడంతో 108 సిబ్బందికి సమాచారం అందించింది. వారు అక్కడికి చేరుకుని ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు గమనించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతదేహన్ని పోస్టుమార్గం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన రామటెంకి బానేష్ మంగళవారం అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం..బానేష్ (36) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మొదటి భార్యతో విడాకులయ్యాయి. పదేళ్ల క్రితం పుష్పను రెండో పెళ్లి చేసుకున్నాడు. 2022లో ఆయన గుండెకు స్టంట్లు వేశారు. అప్పటి నుంచి పని చేయకుండా ఇంటి వద్ద ఉంటున్నాడు. గతేడాది అక్టోబర్‌లో పుష్ప ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనకు చెందిన వెంకటేశ్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. దీంతో పలుమార్లు గొడవలు జరుగాయి. ఈ క్రమంలో బానేష్ మందలించడంతో వెంకటేశ్ ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో పుష్ప, బానేష్‌లపై రెబ్బెనలో కేసు నమోదైంది. జైలుకు వెళ్లి వచ్చారు. ఈ కేసు విషయంలో బానేష్ కొంత అప్పుల పాలయ్యాడు. మంగళవారం భార్య డ్యూటీకి వెళ్లిన సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఇంటికి వచ్చిన ఆమె ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించింది. ఎస్సై ఘటన స్థలానికి చేరుకున్న పరిశీలించారు. బానేష్ మృతిపై అనుమానాలు ఉన్నాయని మేనత్త కోట పోషమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

హైవే పక్కన గుర్తుతెలియని మృతదేహం

వాంకిడి: మండలంలోని ఖమాన ఎక్స్‌రోడ్ సమీపంలో నేషనల్ హైవే-363 పక్కన గుర్తుతెలియని మృతదేహాన్ని పోలీసులు మంగళవారం గుర్తించారు. ఖమాన ఎక్స్‌రోడ్ సమీపంలో పొల్యూషన్ చెకింగ్ వాహన నిర్వాహకుడు.. మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై ఎస్సై ప్రశాంత్‌ను వివరణ కోరగా మృతదేహం గుర్తించలేని స్థితిలో ఉందన్నారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. మృతిచెందిన వ్యక్తి ఎవరు? ఎన్ని రోజులైంది అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సాగునీటికోసం రైతుల ఆందోళన


నిరసన తెలుపుతున్న రైతులు

దండేపల్లి: కడెం ఆయకట్టు కింద యాసంగి పంటలకు వారబంధీ పద్ధతిలో అందిస్తున్న సాగునీరు సక్రమంగా అందడంలేదని డిస్ట్రిబ్యూటరీ 24బీ పరిధిలోని మాకులపేట, తాళ్లపేట గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం కడెం ప్రధాన కాలువలో దిగి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాసంగికి సాగునీరందిస్తామని అధికారులు చెప్పడంతో వరి, మొక్కజొన్న పంటలు సాగు చేశామని, పంటలకు నీరందక ఎండిపోయే పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ డీఈ వెంకటేశం, ఏఈఈ శ్రావణ్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.